క్లుప్తంగా

మున్సిపాలిటీ ఉద్యోగికి గాయాలు

పరకాల: మున్సిపాలిటీలో ఎలక్ట్రీషియన్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న కొమ్ముల సతీష్ శుక్రవారం విద్యుత్‌పోల్‌కు వీధిలైట్ బిగిస్తున్న క్రమంలో జారిపడ్డాడు. కాళ్లకు బలమైన గాయాలు అవడంతో స్థానిక సివిల్ ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ సతీష్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ, వైస్ చైర్మన్ రేగూరి విజయ్‌పాల్‌రెడ్డి పరామర్శించారు.

పల్టీ కొట్టిన కారు



ఆత్మకూరు : అదుపు తప్పి కారు పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వ్యక్తులు సురక్షితంగా బయటపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన కొండా గోపాల్‌రెడ్డి ములుగు జిల్లా మేడారంకు వెళ్లి తిరుగు ప్రయాణం అయ్యారు. ఈ క్రమంలో మండలంలోని కటాక్షపూర్ మత్తడి వద్ద ఉన్న గుంతలో కారు అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఆరుగురు వ్యక్తులు క్షేమంగా బయటపడ్డారని ఎస్సై ప్రసాద్ తెలిపారు.

చర్లపల్లి వాసికి డాక్టరేట్



చల్లా రాజు

నడికూడ: మండలంలోని చర్లపల్లి గ్రామానికి చెందిన చల్లా రాజుకు డాక్టరేట్ వరించింది. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ నుంచి బీజినెస్ మెనేజిమెంట్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ స్మితా సాంబ్రానీ పర్యవేక్షణలో 'ఇంపాక్ట్ ఆఫ్ వర్క్ స్ట్రెస్ ఆన్ ఎఫెక్టివ్‌జాబ్ రిలేటెడ్ పర్‌ఫార్మెన్స్ ఫాక్టర్స్ ఆఫ్ పోలీస్ పర్సోనెల్' అనే అంశంపై రాజు పరిశోధన చేశారు. దీనికి గాను డాక్టరేట్ వరించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అతన్ని అభినందించారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ఎల్కతుర్తి: / దామెర : ఎల్కతుర్తి మండల పరిధిలోని చింతలపల్లి, ఇంధిరానగర్, గోపాల్‌పూర్, సూరారం, బావుపేట గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ లక్ష్మణ్‌నాయక్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు. అలాగే దామెర మండలంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు ఏఈ గుర్రం రమేష్ తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత



దామెర: మండలంలోని కోగిల్వాయి పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించిన వెంకటేశ్వర్లు ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా పీఆర్టీయూ (టీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి జయపాల్‌రెడ్డి శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. హనుమకొండ పట్టణంలో నిర్వహించిన సమావేశంలో పీఆర్టీయూ సంక్షేమ నిధి నుంచి రూ. 1,00,000 బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెంకటేశ్వర్లు ఉపాధ్యాయుడిగా అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. సంఘ సభ్యుల కష్టసుఖాల్లో పీఆర్టీయూ పాల్పంచుకుంటుదన్నారు. పీఆర్టీయూ పత్రికా సంపాదకుడు ఇన్నారెడ్డి, జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, ప్రధానకార్యదర్శి శ్రీహరి, రాష్ట్ర నాయకులు సుధాకర్‌రెడ్డి, నర్సింగరావు, భగవాన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు చల్లా రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి శరత్‌కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు సుందరయ్యనగర్ విద్యార్థులు

వరంగల్: ఈనెల 15, 16వ తేదీల్లో హనుమకొండలో జరగనున్న రాష్ట్ర స్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఐదుగురు బాలికలు నిహారిక, ఉమామహేశ్వరి, తరుణి, ఊహశ్రీ, సౌజన్య, మెదక్ జిల్లా తూప్రాన్‌లో జరగనున్న సీనియర్ బాలుర రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు వంశీ, రోణిక్ ఎంపికైనట్లు ఏనుమాముల సుందరయ్యనగర్ ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం ఎడ్ల మంజుల, పీఈటీ పూజారి అశోక్‌బాబు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు ఎస్ఎంసీ చైర్మన్ కే.సుదర్శన్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉత్తమ ఆశ వర్కర్‌కు సన్మానం

హన్మకొండ: కేంద్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ ఆశ కార్యకర్త అవార్డు అందుకున్న హనుమకొండ వడ్డెపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రం ఆశ కార్యకర్త తాళ్లపల్లి సుశీలను జై భీమ్ యూత్ సభ్యులు సన్మానించారు. జైభీమ్ యూత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆమెను అభినందించారు.

బంతిపూల సాగు భలేబాగు

- ఉద్యాన పంటలపై రైతుల దృష్టి
- పండుగలకు చేతికందుతున్న పంటసాగు
- అర్డర్లు వస్తున్నాయని రైతుల ఆనందం



వల్బాపూర్‌లో సాగు చేస్తున్న బంతితోట



సాగు చేస్తున్న సీతజడ తోట



బంతిపూలు తెంపుతున్న రైతులు

ఎల్కతుర్తి: పెరిగిన ఖర్చులు తగ్గిన దిగుబడులతో నష్టాల ఊబిలో కూరుకుపోయిన రైతులు వాణిజ్య పంటలకు స్వస్తి పలికి ఉద్యాన పంటలపై దృష్టి సారించారు. మండలంలోని వల్బాపూర్ గ్రామానికి చెందిన ముగ్గురు రైతులు తమకున్న భూముల్లో బంతిపూలను సాగుచేస్తూ ఇతర రైతుల దృష్టిని తమవైపుకు తిప్పుకుంటున్నారు. సద్దుల బతుకమ్మ, దీపావళి, సంక్రాంతి పండుగలకు క్రాప్ చేతికందుతుండడంతో పెట్టుబడితో పాటు లాభాలు ఆర్జిస్తున్నారు. ప్రస్తుతం ఎంగిళిపూల బతుకమ్మకు అర్డర్లు వస్తున్నాయని సదరు రైతులు ఆనందిస్తున్నారు. వినాయకచవితి పండుగ సందర్భంగా పూల విక్రయంతో మంచి లాభాలు వచ్చాయని తెలిపారు. కరీంనగర్–హనుమకొండ ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న బంతిపూల తోటను చూసి పలువురు ఆకర్షితులవుతున్నారని, పూలకోసం ఆర్డర్లు ఇస్తున్నారని తెలిపారు. పూలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో సరియైన సమయాల్లో పంట చేతికందడంతో కలిసొస్తుందన్నారు. వరంగల్ పట్టణంలో బంతిసీడు తెచ్చి మొక్కలను గూడెప్పాడ్ నర్సరీలో పెంచి ఇచ్చినందుకు ఒక్క మొక్కకు రూపాయి ఖర్చు తీసుకుంటారని చెప్పారు. మొత్తం 3 వేలు మొక్కలు తెచ్చి సాగు చేశామన్నారు. దీనికి కూలీల ఖర్చు ఏమీ ఉండదని, కుటుంబ సభ్యులు పనిచేసుకుంటే సరిపోతుందని సదరు రైతులు తెలిపారు. తమకున్న ఎకరం భూమిలో 20 గుంటలు ముద్దబంతి, సీతజడ, టమాట, బెండ, క్యాలీఫవర్ సాగు చేశానని, ఈ పంటకు ఖర్చు తక్కువ, లాభాలు ఎక్కువగా ఉన్నాయని రైతులు వెల్లడిస్తున్నారు. ఇప్పటి వరకు రూ. 25వేలు ఖర్చు వచ్చిందని, ప్రస్తుతం సాగుచేసిన బంతిపూలతో బతుకమ్మ పండుగకు సుమారుగా రూ. 80 వేల నుంచి లక్ష వరకు లాభం వచ్చే అవకాశాలు ఉన్నాయని రైతులు అంటున్నారు. సాగుచేసిన బంతిపూలను హుజూరాబాద్, హనుమకొండ మార్కెట్లకు తరలిస్తున్నామన్నారు. స్థానికంగా కూడా మంచి డిమాండ్ ఉందని, బంతిసాగు పంట లాభాల పంట అని అంటున్నారు.

కూలీల బాధ తప్పింది



గతంలో పత్తిపంట సాగుచేశాను. కూలీల ఖర్చు, పురుగు మందుల ఖర్చు పోను పెద్దగా లాభం కనిపించలేదు. స్నేహితుని ద్వారా బంతిసాగు గురించి తెలుసుకొని 3 వేల మొక్కలు నాటి బంతిసాగు మొదలు పెట్టాను. ఇప్పటి వరకు ఖర్చు రూ. 20 నుంచి 25 వేలు వచ్చింది. వినాయక చవితి నుంచే పంట చేతికి అందడంతో లాభాలు వస్తున్నాయి. దీంతో పాటు టమాట, క్యాలీఫ్లవర్ పంట సాగు చేశాను. త్వరలోనే ఆ పంటలు కూడా చేతికి అందనున్నాయి. వాణిజ్య పంటల సాగుకంటే ఈ పంట బెటర్ అనిపిస్తోంది.

– అల్వాల మహేందర్, రైతు, వల్బాపూర్

సీజన్‌కు అనుకూలంగా సాగు చేస్తున్నా



సద్దుల బతుకమ్మ, దీపావళి, సంకాంత్రి పండుగల సీజన్‌కు అనుకూలంగా బంతిపూలు సాగు చేస్తున్నాను. కిలో బంతిపూలు రూ. 80 నుంచి రూ. 120 వరకు విక్రయిస్తున్నాం. పూలు కావాలని ఆడర్లు వస్తున్నాయి. సీజన్ పంటలపై దృష్టి సారించి మంచి పనిచేశావని మా ఊరివాళ్లు పొగుడుతున్నారు. పత్తి, తదితర పంటలకంటే బంతిసాగు చాలా మంచిందనిపిస్తోంది. బతుకమ్మ ప్రారంభం అయ్యినందున గిరాకీ మొదలవుతుంది. రైతులు కూడా ఉద్యాన పంటలపై దృష్టి సారించాలి.

– అంబాల మహేందర్, రైతు, వల్బాపూర్

కౌశిక్‌రెడ్డిని గెలిపించాలి



మాట్లాడుతున్న మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు

కమలాపూర్: నవంబర్ 30వ తేదీన జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో హుజూరాబాద్ నియోజకవర్గం నుంచి పాడి కౌశిక్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీ రామారావు, రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రజలను కోరారు. బీఆర్‌ఎస్ పార్టీ హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి గెలుపుపై శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో మంత్రులు మాట్లాడారు. ప్రధానంగా కమలాపూర్ మండలంలో పార్టీ నేతలందరిని కలుపుకొని భారీ మెజారిటీ వచ్చేలా చూడాలని పార్టీ నేతలకు మంత్రులు సూచించారు. ఉప్పల్‌ను మండలంగా ఏర్పాటు చేయాలని మరోసారి మంత్రుల దృష్టికి తీసుకెళ్లగా ఖచ్చితంగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు బీఆర్‌ఎస్ నేతలు తెలిపారు. మంత్రులతో భేటీ అయిన వారిలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, బీఆర్‌ఎస్ పార్టీ నేతలు రవీందర్‌రావు, ఉప్పల్‌కు చెందిన నాయినేని తిరుపతిరావు తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు



కరపత్రం ఆవిష్కరిస్తున్న అర్చకులు, ధర్మకర్తలు

పరకాల: ఈ నెల 15వ తేదీ నుంచి శ్రీదేవి శరన్నవ రాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభించనున్నట్లు పట్టణంలోని శ్రీకంకుమేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ గందె వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ఆలయ అర్చకులు, ధర్మకర్తలతో కలిసి ఆయన శ్రీదేవి శరన్నవరాత్రి ఆహ్వాన కరపత్రాన్ని ఆవిష్కరించారు. చివరి రోజు 24వ తేదీన త్రిశూల స్నానం కోసం దంపతులకు ఉచిత టోకెన్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు నాగభూషణం పాల్గొన్నారు.

సొంత ఊరుకు సేవ చేయడం అదృష్టం



స్వర్గరథాన్ని బహూకరిస్తున్న సాంబమూర్తి

కమలాపూర్: పుట్టిన ఊరికి సేవ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావించాలని సర్పంచ్ కట్కూరి విజయతిరుపతిరెడ్డి కోరారు. మండల కేంద్రానికి చెందిన ఎస్‌బీఐ బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ తౌటం సాంబమూర్తి తన భార్య తౌటం భాగ్యలక్ష్మి జ్ఞాపకార్థం రూ.6 లక్షల విలువ చేసే స్వర్గరథాన్ని గ్రామపంచాయతీకి శుక్రవారం బహూకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సాంబమూర్తి ఉదార స్వభావం గర్వించదగినదని, దాతలు అతన్ని ఆదర్శంగా తీసుకుని మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి ముందుకు రావాలని కోరారు. అనంతరం సాంబమూర్తిని శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పెండ్యాల రవీందర్‌రెడ్డి, పద్మశాలి సంఘం మండల, పట్టణ అధ్యక్షులు బొప్ప శివశంకర్, బైరి దశరథం, పట్టణ ప్రధాన కార్యదర్శి పులికంటి రాజేందర్, కేఈసీటీ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఈటల సమ్మన్న, నాయకులు తౌటం రవీందర్, మెండు రమేష్, మిట్టపెల్లి ప్రభాకర్, గాజుల సతీష్, కుమారస్వామి, కనుకుంట్ల శ్రీనివాస్, తౌటం సంపత్‌కుమార్, తుమ్మ సాంబమూర్తి, సదానందం, ఈట రమణారెడ్డి, దేశిని అయిలయ్యగౌడ్, జీపీ పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, భాగ్యలక్ష్మి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపనలతోనే సరిపెడుతున్న బీఆర్‌ఎస్



కండువా కప్పి ఆహ్వానిస్తున్న గండ్ర

శాయంపేట : అభివృద్ధి పనులకు మంగళంపాడి కేవలం శంకుస్థాపనలతోనే బీఆర్‌ఎస్ పార్టీ సరిపెడుతుందని భూపాలపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రానికి చెందిన సీఆర్‌పీఎఫ్ మాజీ సైనికుడు దైనంపల్లి రాజయ్య, దైనంపల్లి రాజు, వంగ రాజు, దైనంపల్లి నరేష్‌లతో పాటు పలువురు నాయకులు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరగా ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సత్యనారాయణరావు మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌కు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ కార్డుల భయం పట్టుకుందని అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తామన్నారు. ఎన్నికలకు సమయం దగ్గర పడుతుందని భావించిన బీఆర్‌ఎస్ పార్టీ గృహలక్ష్మి, దళితబంధుతో పాటు వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి ప్రజలను మరోసారి మోసం చేసేందుకు కుట్ర చేస్తుందని విమర్శించారు. కానీ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు రవీందర్, రవిపాల్, రాజు పాల్గొన్నారు.

'గండ్ర' హయాంలోనే అభివృద్ధి

శాయంపేట : నియోజకవర్గ అభివృద్ధి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి హయాంలోనే జరిగిందని పత్తిపాక సర్పంచ్ చిట్టిరెడ్డి రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. భూపాలపల్లి నియోజకవర్గ అభివృద్ధి కోసం గండ్ర దంపతులు అహర్నిషలు కృషి చేస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో గండ్ర వెంకటరమణారెడ్డిని మరోమారు గెలిపించి అసెంబ్లీకి పంపించాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. పత్తిపాక గ్రామంలో కోట్లాది రూపాయల నిధులతో సీసీరోడ్లు, సైడ్ కాల్వల నిర్మాణం, మన ఊరు మన బడి కార్యక్రమం ద్వారా పాఠశాల అభివృద్ధి జరిగాయని అన్నారు. ప్రతిపక్షాల మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు ప్రజలు నమ్మరని బీఆర్‌ఎస్‌కే పట్టం కడతారని ధీమా వ్యక్తం చేశారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని ప్రజలు గండ్ర వెంకటరమణారెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంటా శ్యామ్‌సుందర్‌రెడ్డి, పసుల ప్రవీణ్, కందగట్ల ప్రకాష్, పెండెల కిరణ్, బండ నారాయణ రెడ్డి, సాంబరాజు, రజిత తదితరులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే చల్లాను ఓడించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న కాలనీ వాసులు

పరకాల: దళితులకు వ్యతిరేకంగా అవలంబిస్తున్న స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని వచ్చే ఎన్నికల్లో ఓడించాలని మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి పిలుపునిచ్చారు. ప్రభుత్వ పథకాలను అడ్డం పెట్టుకుని ప్రజలను మోసం చేస్తున్నాడని ఆరోపించారు. దళితబంధు, గృహలక్ష్మి, బీసీబంధు పథకాల పేరుతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను నిరసిస్తూ శుక్రవారం పట్టణంలోని పలు కాలనీలకు చెందిన ప్రజలు 'బీసీబంధు, గృహలక్ష్మి పథకాలను అర్హులకు అందించిన తరువాతనే ఎమ్మెల్యే ధర్మారెడ్డి మా కాలనీలకు రావాలి' అని ముద్రించి ఉన్న ఫ్లెక్సీలతో అమరధామం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ ఇటీవల పట్టణంలో జరిగిన బహిరంగ సభలో మంత్రి కేటీఆర్‌తో పరకాల అమరవీరుల జిల్లా గురించి మాట్లాడించకపోవడంతో స్థానిక ఎమ్మెల్యేకు జిల్లా ఏర్పాటు ఇష్టం లేనట్లు ఉందన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అనుచరులు మాత్రమే బాగుపడ్డారని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు న్యాయం జరగలేదని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకుడు గుజ్జు సత్యనారయణరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ జయంత్‌లాల్, జిల్లా కార్యదర్శి ఎర్రం రామన్న, నాయకులు డాక్టర్ కాళీ ప్రసాద్‌రావు, కౌన్సిలర్లు కొలనుపాక భద్రయ్య, బెజ్జంకి పూర్ణచారి, పట్టణ ప్రధాన కార్యదర్శులు గాజుల నిరంజన్, కుక్కల విజయ్, కార్యదర్శి పచ్చికశంతన్‌రెడ్డి, సంఘ పురుషోత్తం, పాలకుర్తి తిరుపతి, కిసాన్ మోర్చా అధ్యక్షుడు ఆకుల రాంబాబు ఆ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మండల సభకు ప్రజాప్రతినిధుల డుమ్మా



సభ్యులు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

ధర్మసాగర్: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం వైస్ ఎంపీపీ బండారి రవీందర్ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం వెలవెలబోయింది. సభకు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. ఉదయం 12 గంటలకు సమావేశం ప్రారంభం కాగా మండల వ్యాప్తంగా 19 మంది సర్పంచ్‌లు, 14 మంది ఎంపీటీసీలకు గాను పదిమంది ప్రజాప్రతినిధులు కూడా హాజరు కాలేదు. దీంతో సమావేశాన్ని తూతూ మంత్రంగా కొనసాగించి మమా అనిపించారు. దీంతో జెడ్పీటీసీ పిట్టల శ్రీలత విశాఖల అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూశాఖ అధికారుల నిర్లక్ష్యంతో మట్టి దందా జోరుగా సాగుతుందని, రాత్రి వెళల్లో లారీలు, టిప్పర్లతో మట్టిని తరలిస్తున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. తహసీల్దార్ సదానందం మాట్లాడుతూ తాను కొత్తగా వచ్చానని, తనకు పూర్తి సమాచారం లేదని మట్టిని తరలిస్తున్నట్లు తన దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటానని తెలిపారు. వివిధ శాఖల అధికారులు సభకు గైర్హజరు కావడంపై ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. సర్వ సభ్య సమావేశానికి డుమ్మా కొట్టిన అధికారులకు నోటీసులు జారీ చేసి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఎంపీడీఓ జవహర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎంపీఓ కరుణాకర్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సిరికొండ జన్మదిన వేడుకలు



శాయంపేట : కేక్ కట్ చేస్తున్న గుర్రం రవీందర్, బీఆర్‌ఎస్ నాయకులు

నడికూడ: మాజీ స్పీకర్, ప్రతస్తు ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి జన్మదిన వేడుకలను మండంలోని నార్లాపూర్‌లో శుక్రవారం ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. నీలాసమ్మయ్య, మచ్చ రవీందర్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి, కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఉపసర్పంచ్ సదానందం, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : తెలంగాణ తొలి శాసనసభాపతి, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి జన్మదినాన్ని శుక్రవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల మాజీ అధ్యక్షుడు గుర్రం రవీందర్ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. తెలంగాణ రాష్ట్రానికి తొలి స్పీకర్ సిరికొండ మధుసూనాచారి అని, రాష్ట్ర అభివృద్ధిలో ఆయన పాత్ర కీలకమని అన్నారు. భూపాలపల్లి నియోజకవర్గంతో పాటు రాష్ట్ర రాజకీయాల్లో ఆయన సూచనలు ముఖ్యమన్నారు. నాయకులు బగ్గి రమేష్, నిమ్మల మహేందర్, తోకల సమ్మిరెడ్డి, మారెపల్లి సుమన్, బేర్గు రాకేష్, కొత్తగట్టు సాయి, కొడిపాల సందీప్, పృధ్వీరాజ్, సందీప్, విజయ్, రాజు, అశోక్, గణేష్, విజయ్ పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో సంతాన నాగలింగేశ్వరుడు

కాజీపేట: మాస శివరాత్రి వేడుకలను పురస్కరించుకుని కాజీపేట స్వయంభు శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలోని సంతాన నాగలింగేశ్వర స్వామికి శుక్రవారం ప్రత్యేక అలంకరణ పూజలు జరిపించారు. కాశీ నుంచి తెచ్చిన జలాలతో అయినవోలు సాయికృష్ణ శర్మ పర్యవేక్షణలో అర్చకులు నాగలింగేశ్వరుడికి అభిషేకం నిర్వహించారు.

'బొడ్డెమ్మ..బొడ్డెమ్మా కోల్ బిడ్డాలెందారు'



ఆత్మకూరు : బొడ్డెమ్మ ఆడుతున్న మహిళలు



దామెర : ఏకశిల పాఠశాలలో..



కమలాపూర్‌లో..

ఆత్మకూరు : మండలంలో బొడ్డెమ్మ వేడుకలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. పాఠశాలల నుంచి ఇంటికి చేరుకున్న విద్యార్థునులు బొడ్డెమ్మలను పేర్చి బతుకమ్మ పాటలతో అలరించారు. మండల కేంద్రంలోని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన బొడ్డెమ్మ వేడుకల్లో మహిళలు పాల్గొని ఆడిపాడారు.

దామెర: మండల కేంద్రంలోని ఆరెవాడలో శుక్రవారం మహిళలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. చివరి రోజున బొడ్డెమ్మను పసుపు, కుంకుమతో అలంకరించారు. అదే విధంగా వివిధ రకాల పూలు పేర్చి పసుపుతో గౌరమ్మను తయారుచేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చిన్నా, పెద్దా అంతాకలిసి 'బొడ్డెమ్మ...బొడ్డెమ్మా కోల్' అంటూ ఉయ్యాల పాటలు పాడి టెంకాయలు కొట్టి, సత్తిముద్దలను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం గ్రామంలోని గిద్దెచెరువులో నిమజ్జనం చేస్తు వీడ్కోలు పలికారు. అలాగే మండలం కేంద్రం సమీపంలోని ఏకశిలా ప్రైమ్ పాఠశాలలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ కొండల్‌రెడ్డి, పాఠశాల వైస్ ప్రిన్సిపల్ మణికుమార్, నవీన్ ఉన్నారు.

కమలాపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కలిసి కళాశాల మహిళా అధ్యాపకులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. ప్రిన్సిపల్ డి. సంపత్‌కుమార్, ఎన్ఎస్ఎస్ పీఓ రాజ్‌కుమార్, తెలుగు అధ్యాపకురాలు శోభాదేవి, అధ్యాపకులు పుష్పలత, కవిత, శ్రీదేవి, సాంబశివయ్య, సురేష్‌బాబు, రాందాసు, కుమారస్వామి, యామిని, శ్రీనివాస్, సంధ్యారాణి, సిబ్బంది పోచక్క, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

పరకాల: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం బతుకమ్మ సందడి నెలకొంది. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలతో కళాశాలకు విద్యార్థినులు, అధ్యాపకులు ఆడిపాడారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సంతోష్‌కుమార్ ఉన్నారు.

ఎంపీడీఓ బాబుకు సన్మానం



ఎంపీడీఓకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సర్పంచ్‌లు, మాజీ ప్రజాప్రతినిధులు

కమలాపూర్: నూతన ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన బాబును సర్పంచుల ఫోరం ఆధ్వర్యంలో పలువురు సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పెండ్యాల రవీందర్‌రెడ్డి, సర్పంచులు కట్కూరి విజయతిరుపతిరెడ్డి, అంకతి సాంబయ్య, మాట్ల రవీందర్, లడె గోపాల్, చందుపట్ల రజితసరోత్తంరెడ్డి, గుండపు చరణ్‌పటేల్, మాజీ ఎంపీపీ లాండిగె లక్ష్మణ్‌రావు, మాజీ జెడ్పీటీసీ మారపెల్లి నవీన్‌కుమార్, ఎంపీఓ విమల, ఏపీఓ రమేష్, పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

చిన్నారుల హాజరుశాతం పెంచాలి

శాయంపేట : మండలంలోని అంగన్‌వాడీ సెంటర్లలో ప్రీ స్కూల్‌లో చిన్నారుల హాజరు శాతం పెంచాలని సీడీపీఓ భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని ప్రగతిసింగారం అంగన్‌వాడీ కేంద్రంలో పత్తిపాక సెక్టార్‌కు సంబంధించిన ఆయాలకు శుక్రవారం ఆమె పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ సెంటర్లలో చిన్నారుల సంఖ్యను పెంచేందుకు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు సెంటర్ తెరిచి ఉంచాలని అన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సక్రమంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లతో, ఆయాలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మంజుల, అంగన్‌వాడీ టీచర్లు పద్మజ, శ్రీలత, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.